సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

గ్రామాల్లో అభివృద్ధిని కొనసాగించాలి

• మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, జనవరి 3 :పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పనులకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీర మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన వారిలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్ యాదవ్, కందాల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్, పార్టీ మండలాధ్యక్షుడు సంకినపల్లి రఘునందన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దాడులను ఆదిలోనే అరికట్టాలి

• బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

• మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

దవాఖానలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దీపిక

సూర్యాపేట టౌన్, జనవరి 3 : బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ అరాచక శక్తులపై చర్యలు చేపట్టి.. దాడులను ఆదిలోనే అరికట్టాలని, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించకూడదని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి, కాసర్లపహాడ్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలను బుధవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తుంగతుర్తిలో కాంగ్రెస్ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో రక్తపుటేరులు పారినచోట బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలు పారించి అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ పార్టీ తిరిగి ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. నోటికొచ్చినట్టు హామీలిచ్చి ఇప్పుడు నెరవేర్చలేక ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు.

దాడులు ఆపకపోతే ప్రజాక్షేత్రంలో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడొద్దని అండగా ఉంటామని, ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు చేరేవరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. పరామర్శించిన వారిలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్ యాదవ్, కందాల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్, పార్టీ మండలాధ్యక్షుడు సంకినపల్లి రఘునందన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

• సూర్యాపేట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేటలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేట, జనవరి 3 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల శాసన మండలి స్థానానికి త్వరలోనే ఎన్నికలు జరుగనున్నాయని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు నిండిన పట్టభద్రులు ఫామ్ 18 ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైనా యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలని సూచించారు. ఓటు నమోదు ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణకు ఫిబ్రవరి 6వరకు గడువు ఉన్నదని తెలిపారు. ఫిబ్రవరి 24న ముసాయిదా జాబితా విడుదల, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. మార్చి 29 వరకు అభ్యంతరాల పరిష్కారం, ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, అబిద్, గోపి పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మె సైరన్

ఈ నెల 5 నుంచి చేసేందుకు సన్నద్ధం

నల్లగొండ సిటీ, జనవరి 3 : మహాలక్ష్మి పథకంలో మహిళలకు ప్రభుత్వం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య రెండింతలు పెరిగింది. బస్సులు కెపాసిటీకి మించి వెళ్తున్నాయి. దాంతో బస్సులు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయంటున్నారు ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు. కేఎంపీఎల్ కూడా రావడం లేదంటున్నారు. ఖర్చుల భారం భరించలేమంటూ ఈ నెల 5 నుంచి సమ్మెకు దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎంకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 7 డిపోల పరిధిలో 254 అద్దె బస్సులు నడుస్తున్నాయి. కేఎంపీఎల్ తగ్గించి చార్జీలు ఇవ్వాలని, బస్సు టైర్లను బల్క్ రేట్లకే అందజేయాలని, ప్రమాదం జరిగినప్పుడు క్లెయిమ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని పలు డిమాండ్లను అద్దె బస్సు యజమానులు ప్రభుత్వం ముందుంచారు. సమ్మెతో సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందిగా మారనున్నది.

అద్దె బస్సుల ఓనర్లు చెప్తున్నదిదీ..

- మహాలక్ష్మి పథకంతో గతంలో కంటే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగడంతో బస్సుల నిర్వహణ భారంగా మారింది.
- బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్లడంతో టైర్లు వేడెక్కి పేలే అవకాశం ఉంది. కమాన్ కట్టలపై అధిక లోడు పడి అవి విరిగే ప్రమాదం.

డిమాండ్లు

- బస్సులకు నూతన టైర్లు బల్క్ రేట్లకే అందించాలి.
- కేఎంపీఎల్‌ను తగ్గించి చార్జీలు ఇవ్వాలి.
- బస్సులో పరిమితికి మించి ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో క్లెయిమ్‌కు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి.

మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిందంటున్న బస్సుల యజమానులు

అధిక లోడ్‌తో మరమ్మతులకు గురవుతున్నామని ఆందోళన

బస్సుల నిర్వహణ భారం పెరిగిందని ఆవేదన

తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్

ఉమ్మడి జిల్లాలో 7 డిపోల పరిధిలో 254 అద్దె బస్సులు

సమ్మెతో సంక్రాంతి ప్రయాణాలకు ఇబ్బందే..

రోజూ 3లక్షల మంది ప్రయాణికులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకొచ్చాక నల్లగొండ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఖాళీ లేకుండా వెళ్తున్నాయి. ఈ పథకం అమల్లోకి రాక ముందు నల్లగొండ ఉమ్మడి జిల్లా రీజియన్ పరిధి 7 డిపోల్లో ప్రతిరోజూ 2 లక్షల మంది ప్రయాణించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 3లక్షలకు చేరింది. ఇందులో 2లక్షల మంది మహిళలే ఉండడం గమనార్హం. నల్లగొండ రీజియన్‌లో 7 డిపోలకు గానూ 637 బస్సులు ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ 383, అద్దె బస్సులు 254 నడుస్తున్నాయి.

సమ్మె నోటీసులు ఇచ్చారు

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు ఈ నెల 5నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారం మా పరిధిలో లేదు. వారి డిమాండ్లు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, నల్లగొండ

కలెక్టర్ హరిచందన

ఎస్పీ చందనా దీప్తి

మహిళా రథ సారథులు

• నల్లగొండ నూతన కలెక్టర్‌గా హరిచందన

• ఇప్పటికే జిల్లా ఎస్పీగా చందనా దీప్తి

• జిల్లాలో తొలిసారి ఇద్దరు మహిళా బాస్‌లు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాసరి హరిచందన నియామకమయ్యారు. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ కలెక్టర్‌గా రానున్న దాసరి హరిచందన ఇప్పటివరకు ఆయూష్ కమిషనర్ బాధ్యతలతోపాటు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. కాగా ఈ నెల ఒకటిన జిల్లా ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా కలెక్టర్‌గా హరిచందన నియామకంతో జిల్లా చరిత్రలో తొలిసారిగా ఇద్దరూ మహిళా రథసారథులు కావడం విశేషం. వాస్తవంగా గత నెల 17న జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న ఆర్వీ కర్ణన్(2012)ను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్(2019) ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హేమంత్ కేశవ్ పాటిల్ నుంచి గురువారం జిల్లా నూతన కలెక్టర్‌గా హరిచందన బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్‌కు చెందిన హరిచందన తండ్రి దాసరి శ్రీనివాసరావు కూడా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పర్యావరణ అర్థశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన హరిచందన అక్కడే ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ అయిన తన తండ్రి శ్రీనివాసరావు స్ఫూర్తితో తను కూడా సివిల్స్ వైపు దృష్టి సారించి లండన్‌లో ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని ఇండియాకు వచ్చేశారు. సివిల్స్ ప్రిపరేషన్‌లో భాగంగా తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్ సాధించారు. ఐఏఎస్ లక్ష్యంతో 2010లో రెండో అటెంప్ట్‌లో తన లక్ష్యాన్ని సాధించారు. ఐఏఎస్‌కు ఎంపిక య్యాక విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్‌గా, తర్వాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ వచ్చాక కొత్తగా చేపట్టిన ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హరిచందన నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇదే సమయంలో ఆర్వీ కర్ణన్‌కు కూడా తాజా బదిలీల్లో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్ఎంఎస్ఐడీసీ)ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

8న ప్రభుత్వ ఐటీఐలో జాతీయ అప్రెంటిస్ మేళా

భువనగిరి అర్బన్, జనవరి 3 : భువనగిరి ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరవుతాయని, అర్హులైన విద్యార్థులు సంబంధిత పత్రాలతో హాజరై వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

• అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

• జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

రామగిరి, జనవరి 3 : పార్లమెంట్ ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎక్సైజ్, రవాణా, వాణిజ్య పన్నుల శాఖ, ఇన్ కం ట్యాక్స్ అధికారులతో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దున ఉన్న మిర్యాలగూడను ఎక్సైండిచర్ సెన్సిటివ్‌గా గుర్తించాలని నిర్ణయించి ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. మద్యం అక్రమ రవాణా నియంత్రణ తోపాటు అనేక అంశాలపై చర్చించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సరిహద్దు జిల్లా పాలనా అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ, పోలీసు, ఎక్సైజ్, ఇతర శాఖలు పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్ ఫెయిర్

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మిర్యాలగూడ రూరల్, జనవరి 3 : మండలంలోని అవంతీపురం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎస్టీ గురుకుల పాఠశాలల సైన్స్ ఫెయిర్ బుధవారం ముగిసింది. విద్యార్థులు ఆవిష్కరించిన పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్టీ గురుకుల పాఠశాలల రీజినల్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మయ్య, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

జీవన భృతి కల్పించాలి

• కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల విన్నపం

• నల్లగొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడలో నిరసన

మిర్యాలగూడలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

నార్కట్‌పల్లి/ నల్లగొండ సిటీ/ మిర్యాలగూడ, జనవరి 3 : కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి తమ పొట్ట కొట్టిందని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం రాస్తారోకో చేశారు. అదేవిధంగా నల్లగొండ, మిర్యాలగూడలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోల్లో ఎవరూ ప్రయాణించడం లేదని, దాంతో పూటగడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15లక్షల మంది ఆటో కార్మికులు రోడ్డున పడి బిచ్చమెత్తుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని, లేదంటే తమకు నెలకు రూ.15వేల భృతి ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, జిల్లా అధ్యక్షుడు నాజర్ అలీ, మిర్యాలగూడలో ఆటో డ్రైవర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ నాజర్ అలీమీర్జా, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వేజ్, నార్కట్‌పల్లిలో ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు బింగి జానయ్య, నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ ఎత్తేశారు

పేదల సొంతింటి ఆశలు గల్లంతు

యాదాద్రి జిల్లాలో 8,400 మంది దరఖాస్తు

ఇప్పటికే రూ.3లక్షల సాయం కోసం ప్రొసీడింగ్ ఆర్డర్ల అందజేత

అనేక చోట్ల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

ఇప్పుడు స్కీమ్ రద్దు చేయడంతో లబ్ధిదారుల ఆందోళన

యాదాద్రి భువనగిరి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : పేదలకు సొంతింటి నిర్మాణం ఓ కల. ఆ ఆకాంక్షను సాకారం చేసేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. ఇంటి నిర్మాణం కోసం రూ. 3లక్షల సాయం అందించాలని భావించింది. ఈ మేరకు లబ్ధిదారులకు ఆర్డర్ కాపీలను కూడా అందించింది. దాంతో లబ్ధిదారులు అప్పులు తెచ్చి, బంగారం కుదవబెట్టిన డబ్బుతో ఇంటి నిర్మాణాలు కూడా ప్రారంభించారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసింది. దాంతో జిల్లాలో సుమారు 8,400 మందికి ఆర్థిక సాయం అందకుండా పోయినట్లయ్యింది. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనసాగుతున్న పథకాన్ని అర్ధాంతరంగా రద్దు చేయడం ఏంటని భగ్గుమంటున్నారు.

8,400 మందికి ప్రొసీడింగ్ కాపీలు

గృహలక్ష్మి తొలి విడుతలో భాగంగా యాదాద్రి జిల్లాకు 8,400 యూనిట్లు మంజూరు చేశారు. నియోజకవర్గానికి 3వేల చొప్పున యూనిట్లు కేటాయించారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం 34,750 దరఖాస్తులు వచ్చాయి. 24,291మందిని అర్హులను గుర్తించారు. దరఖాస్తుల ఆధారంగా తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి.. సమగ్ర జాబితా రూపొందించారు. పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తూ అర్హులను గుర్తించారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో 3వేల మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. అదేవిధంగా సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్‌లో, మోత్కూరు, అడ్డగూడూరులో 750, రామన్నపేటలో 400 మందిని ఎంపిక చేశారు. అనంతరం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి.. ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు. రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని మూడు దశల్లో ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటి బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు దశలో రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ. లక్ష చెల్లిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో తొలి ప్రొసీడింగ్ మన దగ్గరే

గృహలక్ష్మి పథకం తొలుత మన దగ్గరే అమలైంది. తొలి లబ్ధిదారుగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముక్కులకు చెందిన చుక్కా పావని అనే చేనేత కార్మికురాలు నిలిచింది. ఆగస్టు 12న పోచంపల్లికి వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్‌ను కలిసి తమకు ఇల్లు లేదని, ఆశ్రయం కల్పించాలని పావని విజ్ఞప్తి చేసింది. గృహలక్ష్మి పథకాన్ని ఆమెకు వెంటనే వర్తింపజేయాలని కేటీఆర్ ఆదేశించడంతో అధికారులు ప్రొసీడింగ్ ఆర్డర్ అందించారు.